సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 1 । మే । 2023



డబుల్ ధమాకా

రాజవొమ్మంగి: గ్రామానికి చెందిన శివ అనే రైతుకు చెందిన తోటలో రెండు పిక్కలతో జీడిమామిడి అబ్బురపరుస్తోంది.



నా కెరీర్‌లో మైలురాయిగా 'ఉగ్రం'

'ఉగ్రం' తన సినీ కెరీర్‌లో ఓ హైలెట్ చిత్రంగా నిలిచి పోతుందని ఆ చిత్ర హీరో అల్లరి నరేష్ స్పష్టం చేశారు.

8లో



ప్రయాణం.. మరింత సురక్షితం

ఘాట్‌రోడ్డులో ప్రమాదాల నివారణపై పోలీస్‌శాఖ దృష్టి సారించింది. హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేసింది.

8లో

న్యూస్‌రీల్

పాపికొండలు విహారానికి పోటెత్తిన పర్యాటకులు

- ఏడు పర్యాటక బోట్లలో తరలివెళ్లిన 429 మంది

దేవీపట్నం: గోదావరిలో బోటు షికారు చేస్తూ పాపికొండల అందాలను వీక్షించేందుకు ఆదివారం 429 మంది పర్యాటకులు తరలివెళ్లారు. ముందుగా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న పర్యాటకులు రాజమహేంద్రవరం నుంచి పలు వాహనాల్లో పోశమ్మగండికి చేరుకున్నారు. ఏడు పర్యాటక బోట్లలో నిబంధనలను పాటిస్తూ పేరంటపల్లి వెళ్లి సాయంత్రం తిరిగి పోశమ్మగండికి చేరుకున్నారు.

గండిపోశమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

దేవీపట్నం: పూడిపల్లి పంచాయతీలో అఖండ గోదావరి నది ఒడ్డున కొలువైన గండిపోశమ్మ అమ్మవారి దర్శనానికి ఈ ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పలు జిల్లాల నుంచి పురుషోత్తపట్నం, గోకవరం మీదుగా వాహనాల్లో సుమారు ఐదు వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనం టిక్కెట్లు విక్రయం ద్వారా రూ.29,325 ఆదాయం సమకూరినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

ప్రశాంతంగా ఏకలవ్య ప్రవేశ పరీక్ష



పర్యవేక్షిస్తున్న డీడీ కొండలరావు, సమన్వయకర్త మూర్తి, ప్రిన్సిపాల్ పద్మకుమారి

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఇందుకు సంబంధించి పాడేరు గురుకుల విద్యాలయంలోని రెండు కేంద్రాల్లో నిర్వహించారు. ఏ సెంటర్‌లో 542 మందికి 500, బీ సెంటర్‌లో 799 మందికి 678 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాలకు తీసుకువచ్చారు. గిరిజ సంక్షేమశాఖ డీడీ కొండలరావు, పరీక్షల పరిశీలకుడు యుగంధర్, గురుకులం విద్యాలయాల సమన్వయకర్త పీఎస్ఎన్.మూర్తి, గురుకుల కళాశాల ప్రిన్సిపల్ పద్మకుమారి, పాఠశాల ప్రిన్సిపల్ అమ్మమణి తదితరులు పాల్గొన్నారు.

మూడు కరోనా కేసుల నమోదు

మహారాణిపేట: జిల్లాలో ఆదివారం మూడు కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 178 మందికి పరీక్షలు నిర్వహించగా.. ముగ్గురికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 33కి చేరింది. ఆరుగురు డిశ్చార్జ్ అయ్యారు. 31 మంది హోం ఐసోలేషన్‌లో, ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే గుర్తింపు రద్దు

విశాఖ విద్య: వేసవి సెలవుల్లో ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో తరగతులు నిర్వహించినట్లయితే గుర్తింపు రద్దు చేస్తామని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో కొన్ని కాలేజీల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి వాటిపై నిఘా పెట్టామన్నారు. అలాగే కాలేజీల్లో ఎటువంటి అడ్మిషన్లు కూడా చేపట్టడానికి వీల్లేదన్నారు.

నేడు ఏయూ ఇంజనీరింగ్ ఎచీవర్స్ డే



ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎచీవర్స్ డే వేడుకలు సోమవారం నిర్వహించనున్నారు. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే ఈ వేడుకల్లో విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించి, విద్యార్థులకు నియామక పత్రాలను అందజేస్తారు. ఈ విద్యా సంవత్సరంలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు 1500 వందలకు పైగా ఉపాధి అవకాశాలు లభించాయి. ఇంకా మరికొన్ని సంస్థలు నియామకాలకు సంబంధించిన ఫలితాలను వెలువరించాల్సి ఉంది. అత్యధిక ఉద్యోగ అవకాశాలతో పాటు, అత్యధిక వేతనాలను సైతం ఈ బ్యాచ్ విద్యార్థులు సాధించారు. ఈ ఆనందాన్ని వారి తల్లిదండ్రులతో పంచుకునే వేడుకకు వర్సిటీ ఘనంగా ఏర్పాటు చేసింది.

తెలుగు రాష్ట్రాలకు తలమానికం

తెలుగు రాష్ట్రాల్లో ఏడాది పొడవునా విద్యుత్ ఉత్పత్తి చేసే అతి పెద్ద ప్రాజెక్టుగా పొల్లూరు విద్యుత్ కేంద్రం అవతరించనుంది. శ్రీశైలం, సాగర్ దీనికన్నా పెద్ద (బహుళార్థక సాధక) ప్రాజెక్టులు అయినప్పటికీ విద్యుత్ ఉత్పత్తి ఏడాది పొడవునా ఉండదు. సీలేరు కాంప్లెక్సు పరిధిలో గల ఈ ప్రాజెక్టు మాత్రం నిరంతరం విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ వెలుగులు పంచుతోంది. మరోపక్క కీలక దశలో గోదావరి డెల్టా నీరందిస్తూ రెండో పంటకు జీవం పోస్తోంది.

- అతిపెద్ద పవర్ ప్రాజెక్టుగా పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం
- ప్రస్తుత ఉత్పత్తి సామర్థ్యం 460 మెగావాట్లు
- 5,6 యూనిట్ల ఏర్పాటుతో మరో 230 మెగావాట్ల ఉత్పత్తి
- మరోపక్క సాగునీరు అందిస్తూ గోదావరి డెల్టాకు జీవం



పొల్లూరు గ్రామం వద్ద పెనస్టాక్ పైప్ లైన్ బెండింగ్ పనుల కోసం నిర్మించిన షెడ్డు



పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో 5,6 యూనిట్లు ఏర్పాటుచేయనున్న ప్రాంతం

మోతుగూడెం: సీలేరు విద్యుత్ కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో 5, 6 యూనిట్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకుగాను కేంద్ర పర్యావరణశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పనులు దక్కించుకున్న నిర్మాణ సంస్థ ఇప్పటికే పొల్లూరు గ్రామం వద్ద షెడ్లు వేసి పెనస్టాక్ పైప్ లైన్ గొట్టాల తయారీ మొదలు పెట్టింది. దీంతోపాటు ఐదు, ఆరు యూనిట్లకు సంబంధించి వాల్వ్ హౌస్ నుంచి పవర్ హౌస్ వరకు సివిల్ వర్క్ నిర్మాణ పనులు చేపట్టింది. ఈ రెండు యూనిట్ల నిర్మాణం జరిగితే మరో 230 మెగావాట్లు విద్యుత్ అదనంగా ఉత్పత్తి కానుంది.

1976లోనే ప్రతిపాదన..

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో ప్రస్తుతం నాలుగు యూనిట్లు ఉన్నాయి. వీటి ద్వారా 460 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. కొత్తగా ఏర్పాటుచేయనున్న 5,6 యూనిట్ల ద్వారా మరో 230 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగనుంది. సీలేరు నదిపై చింతూరు మండలం పొల్లూరు వద్ద ఈ ప్రాజెక్టును 1976లో ఏర్పాట్లుచేశారు. అప్పట్లోనే అధికారులు ముందు చూపుతో ఆరు యూనిట్ల నిర్మాణం ఏపీజెన్‌కో ప్రతిపాదించింది. అయితే అప్పటి నీటి లభ్యత ఆధారంగా నాలుగు యూనిట్లను మాత్రమే నిర్మించింది. అప్పట్లో డొంకరాయి నుంచి 16 కిలో మీటర్ల మేర పవర్‌కెనాల్‌ను నాలుగు యూనిట్లకు సరిపడినట్లుగా నిర్మించారు.

నేరుగా ప్రత్యేక పైపులైన్‌కు అవకాశం


ఇప్పుడు కొత్తగా రెండు యూనిట్లు ఏర్పాటుచేయనున్న నేపథ్యంలో అవసరమైన నీటికోసం డొంకరాయి జలాశయం నుంచి పొల్లూరు విద్యుత్ కేంద్రం వరకు ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు ప్రతిపాదన కూడా ఉంది. వాల్ హౌస్ నుంచి పవర్ హౌస్ వరకు సివిల్ మరియు చిన్న చిన్న కాంక్రీట్ పనులు అప్పట్లోనే పూర్తి చేశారు.

గత ప్రభుత్వాల నిర్లక్ష్యం..

గత కొన్ని సంవత్సరాల నుంచి రెండు యూనిట్ల నిర్మాణానికి గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు ఐదు ,ఆరు యూనిట్లు నిర్మాణానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఐదు, ఆరు యూనిట్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. పర్యావరణ అనుమతులు రాకపోవడంతో ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు.

గ్రామసభ ఆమోదంతో..

గత ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన గ్రామసభ నిర్వహించి నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. యూనిట్ల నిర్మాణానికి సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు సమీప గ్రామ ప్రజలు చేయకపోవడంతో కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్ట్ పొందిన నిర్మాణ సంస్థ గత నాలుగు నెలల నుంచి యూనిట్లకు సంబంధించి పైప్‌లైన్‌తో పాటు సివిల్ పనులు ప్రారంభించింది. పర్యావరణ అనుమతులు రావడంతో ఇక పనులు దక్కించుకున్న నిర్మాణ సంస్థ వేగవంతం చేసింది.



పొల్లూరు జల విద్యుత్ కేంద్రం

ఏడాదిలో రెండు నెలలు..

పొల్లూరు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం రోజుకు 4 వేల క్యూసెక్కుల నీరు సీలేరు నది ద్వారా గోదావరిలో కలుస్తోంది. అంతేకాకుండా గోదావరి డెల్టా రెండో పంటకు అవసరమైన సమయంలో రెండు నెలలపాటు 3 నుంచి 4 వేల కూసెక్కుల నీటిని అందిస్తోంది.

> **వచ్చే ఏడాది నాటికి పనులు పూర్తి**
>
> పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి సంబంధించి 5, 6 యూనిట్ల నిర్మాణ పనులను వచ్చే ఏడాది నాటికి పూర్తి చేస్తాం. ఇందుకు గాను ప్రభుత్వం సుమారు రూ. 530 కోట్లను వెచ్చిస్తోంది. రెండు యూనిట్లు అందుబాటులోకి వస్తే ఈ కేంద్రానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది.
>
> – బి. శ్రీధర్, చీఫ్ ఇంజినీర్, లోయర్ సీలేరు కాంప్లెక్సు, మోతుగూడెం.

మహిళ దారుణ హత్య



మహిళ మృతదేహం

సీలేరు : గూడెంకొత్తవీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధి ధారకొండ గ్రామంలో మహిళ దారుణ హత్యకు గురైంది. గూడెం కొత్తవీధి సీఐ అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ధారకొండ గ్రామానికి చెందిన గడుతూరి వలసమ్మ (50) ఆదివారం ఉదయం ఏడు గంటల సమయంలో పక్కనే ఉన్న అడవిలోకి కర్రలు కొట్టేందుకు వెళ్లింది. మధ్యాహ్నం అయినప్పటికీ రాకపోవడంతో ఇంట్లో వాళ్లు ఆమె అటవీప్రాంతానికి వెళ్లారు. విగత జీవిగా పడిఉన్న వలసమ్మను పరిశీలించగా మెడ, మొహంపై గాయాలున్నాయి. హత్యకు గురైనట్టు గుర్తించిన వారు వెంటనే పోలీసులకు తెలియజేశారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. గాయాలుండటంతో హత్యకు గురైనట్టు నిర్ధారణకు వచ్చిన పోలీసులు దీనికి కారకులెవరు అనేకోణంలో విచారణ చేస్తున్నారు. మృతదేహాన్ని ధారకొండ పీహెచ్‌సీకి తరలించి, అక్కడ పోస్టుమార్టం నిర్వహించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

హుషారుగా ఇళ్లకు..

పాఠశాలలకు వేసవి సెలవులు



పాడేరులో లగేజీతో ఇళ్లకు వెళుతున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

సాక్షి,పాడేరు: వేసవి సెలవులతో పాఠశాలలకు తాత్కాలిక విరామం నెలకొంది.ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, గురుకుల విద్యాలయాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలన్నీ ఆదివారం మధ్యాహ్నం వరకు పనిచేశాయి. విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సమావేశాలు విజయవంతమయ్యాయి. కొన్ని విద్యాలయాల్లో విద్యార్థులు శనివారమే ఇళ్లకు వెళ్లిపోయారు. మిగిలిన విద్యార్థులంతా తమ తల్లిదండ్రుల పర్యవేక్షణలో బ్యాగ్‌లు, పెట్టెలతో హుషారుగా ఇళ్లకు పరుగులు తీశారు.పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ విద్యార్థుల ప్రయాణాలతో రెండు రోజులుగా రద్దీగా మారింది. సర్వీసు జీపులు, ఆటోలను కూడా విద్యార్థులు ఆశ్రయించి తమ గ్రామాలకు ప్రయాణమయ్యారు. జూన్ 12న మరలా పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

నేటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

అరకులోయలో ఏర్పాట్లు పూర్తి



ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన స్వామి వారి హోర్డింగ్



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో వేంటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ఈనెల 3వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని సర్వాంగా సుందరంగా ముస్తాబు చేశారు. ప్రధాన రహదారిలో స్వామివారి భారీ కటౌట్ ఏర్పాటు చేశారు. ,స్థానిక పోలీస్‌స్టేషన్ ప్రాంతం నుంచి గిరిజన మ్యూజియం మీదుగా గ్రీన్‌వ్యాలీ జంక్షన్ వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. కల్యాణం తిలకించేందుకు వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లుచేశారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఆర్చి వద్ద స్థలాన్ని వాహనాల పార్కింగ్‌కు కేటాయించినట్టు వారు పేర్కొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

మండల కేంద్రంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు.



ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి



మహేష్ మృతదేహం

వీఆర్‌పురం: డబ్బు వృథాగా ఖర్చు చేయవద్దని భార్య మందలించడంతో మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని ధర్మతాళ్ల గూడెంలో శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలాఉన్నాయి. గ్రామానికి చెందిన కొవ్వాసి రమేష్ (24), పోసమ్మ దంపతులకు ఇద్దరు పిల్లలు. కాగా రమేష్ వృథాగా డబ్బు ఖర్చు చేస్తుండటంతో భార్య తరచూ మందలిస్తుండేది. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకునేంది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం రమేష్ బీరువాలో నగదును తీస్తుండంతో భార్య అడ్డుపడింది. దీంతో మనస్తాపం చెందిన అతను ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. సమీపంలోని పొలంలో పురుగుమందు తాగి ఇంటికి వచ్చి మంచంపై పడుకున్నాడు. పురుగు మందు వాసనను గుర్తించిన పోసమ్మ రమేష్‌ను ప్రశ్నించింది. పురుగుమందు తాగినట్లు అతడు తెలపడంతో హుటాహుటిన రేఖపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లింది. అక్కడి నుంచి 108 వాహనంలో మెరుగైన చికిత్స కోసం భద్రాచలం తరలిస్తుండగా మార్గం మధ్యలో రమేష్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెల్లం దుర్గా ప్రసాద్ తెలిపారు.

బైక్ ప్రమాదంలో గిరి యువకుడు..

జి.మాడుగుల: పాడేరు రోడ్డులో అదుపుతప్పి ప్రమాదానికి గురైన ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. జి.మాడుగుల మండలం భీరం పంచాయతీ వి.కోడాపల్లి గ్రామానికి చెందిన ఉల్లి కొండబాబు,రత్నాలమ్మ దంపతుల కుమారుడు ఉల్లి మహేష్(20) ఆదివారం బైక్‌పై పాడేరు వైపు బయలుదేరాడు. సంతబయలు మలుపు వద్ద అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతనిని 108వాహనంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ మృతి చెందాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక పోలీసులు తెలిపారు.

రెండో విడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై రెండో విడత చందనం అరగదీత ఆదివారం నుంచి శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈనెల 5వ తేదీన వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సమర్పించనున్న మూడు మణుగుల పచ్చి చందనం(120కిలోలు) కోసం ఈ అరగదీతను చేపట్టారు. ఆలయ బేడామండపంలో సుమారు 15మంది సిబ్బంది సుమారు 30 కిలోలు చందనాన్ని అరగదీశారు. మరో మూడు రోజులపాటు చందనం అరగదీత చేపట్టనున్నారు.

ఘనంగా అమ్మవారి జన్మదిన వేడుకలు

సాక్షి,పాడేరు: ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్, వాసవీ హిల్స్ క్లబ్, వాసవీ మోదమాంబ వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కన్యకాపరమేశ్వరి చిత్రపటం,ఉత్సవ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి,డాక్టర్ తమర్బ నరసింగరావు,ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు,రమాదేవి దంపతులు తొలిపూజలు చేశారు.వుడా రమణబాబు,సత్యగౌరి, నాగేశ్వరరావు,రాధ, రామనాగు, రమ్య, కేదారిశెట్టి దుర్గారావు, నాగమల్లేశ్వరి దంపతులు హోమం కార్యక్రమం నిర్వహించారు.ప్రత్యేక పూజలు అనంతరం మధ్యాహ్నం ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావులతోపాటు వాసవీ క్లబ్ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, వాసవీ క్లబ్ ప్రతినిధులు వుడా త్రినాథరావు, శ్రీనాధు శ్రీను, శిరీష, సత్యవరపు సోమరాజు, ఉప్పల వెంకటరత్నం, డోకుపర్తి అప్పలరాజు, పుట్టా నానాజీ, మోదకొండమ్మ, ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయాల ఆధ్యాత్మిక సేవా కమిటీల ప్రతినిధులు, వర్తకులు పాల్గొన్నారు.



వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి చిత్రపటం వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొట్టగుల్ల భాగ్యలక్ష్మి

తేలనున్న కాలేజీల లెక్క

- ప్రైవేటు జూనియర్ కాలేజీల తనిఖీకి త్రీమెన్ కమిటీ
- ఉమ్మడి విశాఖలో నాలుగు బృందాల ఏర్పాటు
- నిబంధనలు పాటిస్తేనే ప్రవేశాలకు అనుమతి

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ కోర్సు ప్రాధాన్యత దృష్ట్యా జూనియర్ కాలేజీల నిర్వహణపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. నిబంధనలు పాటించని కాలేజీల్లో ప్రవేశాలకు అనుమతి ఇవ్వడానికి వీల్లేదని స్పష్టం చేసింది. గుర్తింపు కోసం ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీ యాజమాన్యాలు ఆన్‌లైన్ ద్వారా సమర్పించిన దరఖాస్తుల్లో వాస్తవమెంతనేది సమగ్ర పరిశీలన చేసేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. 2023–24 విద్యా సంవత్సరంలో జూన్ 1న ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభించాల్సి ఉన్నందున, ఈలోగానే ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో తనిఖీలు పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

త్రీమెన్ కమిటీతో వాస్తవికత

ప్రభుత్వ ఆదేశాలతో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో తనిఖీలపై ఈ సారి నిశిత పరిశీలన చేసేందుకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఆర్ఐవో/డీవీఈవో, ఒక ప్రిన్సిపాల్, ఒక సీనియర్ ఫిజిక్స్/జువాలజీ లెక్చరర్లతో కూడిన త్రీమెన్ కమిటీ నియమించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో నాలుగు కమిటీలు ఏర్పాటు చేశారు. వీరు ఏ కాలేజీలను తనిఖీ చేయాలనేది నేరుగా కమిషనరేట్ నుంచి సమాచారం ఇవ్వనున్నారు. తనిఖీ సమయంలో త్రీమెన్ కమిటీలో ఉన్న ముగ్గురు అధికారులు, తాము క్షేత్రస్థాయిలో చూసిన పరిస్థితులపై వేర్వేరుగా తమ నివేదికను ఆన్‌లైన్ ద్వారా నేరుగా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా ముగ్గురు అధికారులు ఇచ్చిన నివేదికను బేరీజు వేసుకున్న తర్వాతనే ఆయా కాలేజీల్లో ప్రవేశాలకు అనుమతి ఇవ్వనున్నారు.

నివేదిక మేరకే..

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 2022 – 23 విద్యా సంవత్సరానికి 382 జూనియర్ కాలేజీలు ఇంటర్మీడియట్ బోర్డు వద్ద నమోదయ్యాయి. వీటిలో 21 కాలేజీలు నిర్వహణలో లేవు. 13 కాలేజీల్లో మొదటి సంవత్సరం అడ్మిషన్లు జరగలేదు. 6 కళాశాలల్లో మొదటి, రెండో సంవత్సరం అడ్మిషన్లు కూడా లేవు. ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో విశాఖపట్నంలో 151, అనకాపల్లిలో 77, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 కాలేజీలు ఉన్నాయి. త్రీమెన్ కమిటీలు వీటిని తనిఖీ చేసి, ఇచ్చిన నివేదిక మేరకు 2023 – 24 విద్యా సంవత్సరంలో ఎన్ని కాలేజీలు నిర్వహణలో ఉంటాయనే లెక్క తేలనుంది.



విశాఖలోని ఆర్ఐవో కార్యాలయం

నిబంధనలు పాటించాల్సిందే..

కాలేజీ నిర్వహణకు అనువైన భవనాలు, దీనికి సంబంధించిన వాస్తవ ధ్రువీకరణ పత్రాలు, ఫైర్ సేఫ్టీ, ఆట స్థలం, సైన్సు ల్యాబ్, అర్హత కలిగిన అధ్యాపకులు ఎంతమంది ఉన్నారనేది కమిటీ పూర్తి స్థాయిలో పరిశీలించనుంది. వీటికి సంబంధించి లేటెస్ట్ ధ్రువపత్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకునేలా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. ఇందుకోసమని నిర్దిష్ట ప్రొఫార్మా రూపొందించారు. తనిఖీలో గుర్తించిన అంశాలను బృందం సభ్యులు ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. లోపాలు సరిచేసుకునేలా ముందస్తు నోటీసు ఇచ్చిన అనంతరం, అన్ని రకాల నిబంధనలు పాటించిన కాలేజీలకే 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి ఇవ్వనుంది.

మత్స్యమాడుగులమ్మ ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారు



ఘటాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న మత్స్యరాస వంశీయులు, మహిళలు

జి.మాడుగుల: స్థానిక గంత కొండపై కొలువై ఉన్న మత్స్యమాడుగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి, గిరిజన సంప్రదాయ ప్రకారం ఉత్సవాలు జరుగుతున్నాయి. మత్స్యరాస వంశీయులు, మాజీ మంత్రి మణికుమారి, మహిళలు ఘటాలు, పూర్వీకులు ఉపయోగించిన నాటు తుపాకీ, ఖడ్గాలను డప్పు వాయిద్యాలలో ఊరేగింపుగా తీసుకొచ్చి రామాలయం ఆవరణలోని సతకంపట్టు వద్ద ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమం మాజీ ఎంపీ మత్స్య రాస మత్స్యరాజు స్వగృహం నుంచి ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు మత్స్యరాస వరహాలరాజు, అధ్యక్షుడు మత్స్యరాస రామకృష్ణంరాజు, కార్యదర్శి నారాయణరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.మత్స్యరాజు,మాజీ ఎంపీపీ వరహాలమ్మ ఆపల్నొగ్గారు.

ఏళ్ల నాటి కల.. నెరవేరిన వేళ 8లో

క్లుప్తంగా

కన్యకాపరమేశ్వరి ఆలయ 50వ వార్షికోత్సవం



యలమంచిలి : పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జయంతోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈ నెల 4 వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆదివారం అమ్మవారికి 108 కలశాలతో సామూహిక మంగళస్నానం చేయించి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆర్య వైశ్య సామాజిక వర్గానికి చెందిన పురుషులు, మహిళలు సంప్రదాయ దుస్తులతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 108 మంది దంపతులతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి జీవిత చరిత్ర పారాయణం చేశారు. సాయంత్రం 108 రకాల హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు సత్యగుప్తా, కౌన్సిలర్ కట్టమూరి సుజాతను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉత్సవ కార్యక్రమాల వివరాలు ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ బి.ఎస్ బంగారు శెట్టి ఆదివారం రాత్రి మీడియాకు తెలిపారు. ఈ నెల 1వ తేదీ సోమవారం ప్రత్యేకాభిషేకం అనంతరం 108 మంది యువతులతో కుంకుమ పూజ, కల్యాణాలు, 2వ తేదీ మంగళవారం నెయ్యితో తొలి అభిషేకం, రాత్రి దీపాలంకరణ సేవ, మహిళలతో కోలాటం, 3వ తేదీ బుధవారం తేనెతో ప్రత్యేకాభిషేకం, 108 మంది మహిళలతో కుంకుమ పూజ, సాయంత్రం కీర్తనలు, 4వ తేదీ గురువారం పండ్ల రసాలు సుగంధ ద్రవ్యాలు పంచదార మిశ్రమంతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, రాత్రి పవళింపుసేవ నిర్వహిస్తారు.

ఏళ్ల నాటి కల.. నెరవేరిన వేళ

- ప్రభుత్వం చొరవతో పూర్తయిన జర్రెల రహదారి
- రహదారి నిర్మాణానికి రూ.2.50 కోట్లు విడుదల
- మూడు పంచాయతీల్లో సుమారు వందకు పైగా గ్రామాలకు తీరిన రవాణా కష్టాలు


జర్రెలలో నిర్మించిన సీసీరోడ్డు

గూడెంకొత్తవీధి: అల్లూరి జిల్లాలో అత్యంత మారుమూల ప్రాంతంగా జర్రెల పంచాయతీకి పేరుంది. దీనికి ఆనుకుని వంచుల, మొండిగెడ్డ పంచాయతీలున్నాయి. ఇవన్నీ ఒకప్పుడు మావోయిస్టు కంచుకోటగా పేరొందాయి. దీంతో ఆయా గ్రామాల వైపు అధికారులు కన్నెత్తి చూసేవారు కాదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆయా పంచాయతీల్లో కనీస అభివృద్ధి జాడలేకుండా పోయింది. చింతపల్లి మీదుగా మూడు పంచాయతీలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తికాకపోవడంతో ఆయా ప్రాంతవాసులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. రోడ్డు లేకపోవడంతో బస్సులు తిరిగేవి కావు. ప్రయివేటు వాహనాలపైనే ఆధారపడేవారు. అసలే ఇరుకైన ఘాట్‌రోడ్లో దుర్భరమైన రహదారిలో వాహనాలు తరచూ ప్రమాదాలకు గురయ్యేవి. కొందరు ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కూడా కోల్పోయిన ఘటనలున్నాయి. గ్రామానికి రహదారి నిర్మించాలని గతంలో అధికారుల చుట్టూ తిరిగేవారు. అప్పటి యంత్రాంగం మావోయిస్టుల సాకును కారణంగా చూపించి రహదారి నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసింది. గతంలో ఒకసారి పోలీసులే చొరవ చూపి జర్రెలకు రహదారి నిర్మించాలని నిర్ణయించి కొంతమేర రహదారిని చదును చేయించారు. అయితే అటవీ అధికారులు వచ్చి ఆంక్షలు విధించారు. జర్రెల ఘాట్‌రోడ్డులో రహదారి నిర్మిస్తే అడవికి నష్టం వాటిల్లుతుందని ఇది పూర్తిగా రిజర్వు అటవీ ప్రాంతం అంటూ అడ్డు చెప్పారు. దీంతో రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయింది.

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చొరవతో

జర్రెల, మొండిగెడ్డ, వంచుల గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పాడేరు ఎమ్మెల్యే ఈ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు అక్కడ గిరిజనులంతా తమ గ్రామానికి రహదారి నిర్మించాలంటూ ప్రాథేయపడ్డారు. దీంతో ఆమె జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, సబ్‌కలెక్టర్, డీఎఫ్‌ఓ తదితర ఉన్నతాధికారులతో మాట్లాడి జర్రెల రహదారి నిర్మాణానికి ఉన్న ఆటంకాలన్నింటినీ తొలగించేందుకు చొరవ చూపారు. ప్రభుత్వం పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా రూ.2.50కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో కొద్దికాలం కింద జర్రెల రహదారి పనులు మొదలయ్యాయి. రహదారి నిర్మాణం పూర్తయ్యేంతవరకూ జర్రెల, వంచుల, మొండిగెడ్డ పంచాయతీ సర్పంచ్‌లు నాగరాజు, కాసులమ్మ, ప్రియాంకలు ఎంతో శ్రమించారు. అధికారులను సమన్వయం చేసుకుని రహదారి నిర్మాణానికి పూర్తిగా సహకరించారు. ఈ ప్రాంత గిరిజనులు సైతం తమ గ్రామానికి జరిగే రహదారి నిర్మాణానికి ఎటువంటి ఆటంకాలు రాకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో కొత్తపాలెం వద్ద ప్రత్యేకంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలు రాకపోకలు జరగకుండా కాపలాకాశారు. మొత్తం మీద అంతా ఆశించినట్టుగానే ఎట్టకేలకు జర్రెల ఘాట్‌రోడ్లో సీసీరోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. దీంతో మూడు పంచాయతీల పరిధిలోని సుమారు వంద గ్రామాల గిరిజనులకు రహదారి, రవాణా సమస్యలు పూర్తిగా తీరాయి. దీంతో ప్రభుత్వం చొరవతో తమ గ్రామానికి రహదారి పూర్తయ్యిందన్న ఆనందాన్ని ఈప్రాంత గిరిజనులు వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణం.. మరింత సురక్షితం

- ఘాట్‌రోడ్డులో మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు
- పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు


ములియగుడ సమీపంలోని హెయిర్ పిన్‌బెండ్ మలుపు వద్ద ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

అనంతగిరి: మన్యంలోని ప్రకృతి, పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు రోడ్డు ప్రయాణానికి అధికంగా ఇష్టపడుతుంటారు. ఘాట్‌రోడ్డు ప్రయాణం అవగాహన లేకపోవడంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై పోలీస్‌శాఖ దృష్టి సారించి, ప్రమాదాలు నివారించేలా చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీస్‌శాఖ మరో అడుగు ముందుకు వేసి, విశాఖపట్నం అపోలో అస్పత్రి సహకారంతో ప్రమాదకరమైన మలుపువద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదాలు

మన్యం అందాలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి భారీగా పర్యాటకులు తరలివస్తుంటారు. ఘాట్ రోడ్డు ప్రయాణం అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు గురయ్యేవారు. ప్రమాదాలకు గల కారణం హెచ్చరిక బోర్డులు లేకపోవడమే. ప్రస్తుతం ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా అనంతగిరి నుంచి అరకులోయ మీదుగా డుంబ్రిగుడ వరకు పోలీస్‌శాఖ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది. సుమారు 270 బోర్డుల వరకు ఏర్పాటు చేసినట్టుగా పోలీస్‌శాఖ తెలిపింది. పోలీస్‌శాఖ చేపట్టిన చర్యలపై పలువురు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతగిరి– అరకు, డుంబ్రిగుడ వరకు ప్రమాదకమైన మలుపుల్లో హెచ్చరిక బోర్డులు ఉండడం ప్రమాదాలు తప్పుతాయని భావిస్తున్నారు.

వాహనచోదకులకు సూచనలు



తనిఖీల సమయంలోని తప్పనిసరిగా ఘాట్‌రోడ్డు ప్రయాణంపై అవగాహన కల్పిస్తున్నాం. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నాం. ఘాట్‌రోడ్డులోని పలు ప్రమాదకరమైన మలుపుల వద్ద వాహనదారులకు అవగాహన కల్పించేలా హెచ్చరికబోర్డులను ఏర్పాటు చేశాం.

– కరక రాము, అనంతగిరి ఎస్ఐ

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

- చివరి దశకు చేరిన మోదకొండమ్మ క్రికెట్ టోర్నీ
- ఫైనల్‌కు చేరిన దుమ్మాపుట్టు, లోచలిపుట్టు జట్లు
- నేడే ఫైనల్ మ్యాచ్


ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందజేస్తున్న పాడేరు ఎస్ఐ రంజిత్‌కుమార్

పాడేరు రూరల్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, గిరిజనుల ప్రజల కల్పవల్లి పాడేరు మోదకొండమ్మ తల్లి రాష్ట్ర గిరిజన జాతర సందర్భంగా పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న 35వ రాష్ట్ర క్రికెట్ టోర్నీ చివరి దశకు చేరుకుంది. ఈ టోర్నమెంట్‌లో రాష్ట్ర నలుమూలల నుంచి 76 క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయి. రౌండ్ రాబిన్ పద్ధతిలో నిర్వహించిన ఆదివారం సెమీ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించారు. తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో దుమ్మాపుట్టు–తగరపువలస జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో దుమ్మాపుట్టు జట్టు ఘన విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. మధ్యాహ్నం జరిగిన సీనియర్ సిటిజన్స్ లోచలిపుట్టు, కేవీఆర్ ఫార్చ్యూన్ పాడేరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్కంఠ పోరులో సీనియర్ సిటిజన్స్ జట్టు విజయం సాధించింది. సెమీ ఫైనల్ మ్యాచ్‌లలో గెలుపొందిన జట్లలో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులను పాడేరు ఎస్ఐ రంజిత్‌కుమార్, ఉత్సవ కమిటి అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర, ప్రధాన కార్యదర్శి నవర మోదకొండబాబు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కొట్టగుళ్లి సుబ్బారావు అందజేశారు. సెమీ ఫైనల్స్‌లో గెలుపొందిన జట్ల సభ్యులకు వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు దన్నేటి పలాసి రాంబాబు దుశ్శాలువాలతో సన్మానించారు. ఫైనల్‌కు చేరిన దుమ్మపుట్టు, సీనియర్ సిటిజన్స్ లోచలిపుట్టు జట్ల మధ్య సోమవారం మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నీలో గెలుపొందిన జట్లకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు విన్నర్స్, రన్నర్స్ ట్రోఫీలను అందజేస్తున్నారు. గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ.లక్ష నగదును రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, రెండో బహుమతిని ఎస్వీఎం ఫార్మర్ ప్రొడ్యుసర్ కంపెనీ చైర్మన్ కుర్రబోయిన సింహాచలం, మూడో బహుమతిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు జంపరంగి లిల్లీ, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కనీ్వనర్ తెడబారికి సురేష్‌కుమార్ అందజేయనున్నారు. వీరితో పాటు ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు వ్యక్తిగత బహుమతులను కూడా అందజేస్తున్నారు. ఈ టోర్నీలో భాగంగా ఫైనల్ మ్యాచ్‌లను సోమవారం నిర్వహిస్తామని టోర్నీ నిర్వాహకులు కె.దుర్గారావు, టి.మహేష్, ఎ.రాజారావు, పి.నరేష్, డి.సతీష్ తెలిపారు.

నా కెరీర్‌లో మైలురాయిగా ‘ఉగ్రం’

హీరో అల్లరి నరేష్

దాబాగార్డెన్స్: ‘ఉగ్రం’ తన సినీ కెరీర్‌లో ఓ హైలెట్ చిత్రంగా నిలిచి పోతుందని ఆ చిత్ర హీరో అల్లరి నరేష్ స్పష్టం చేశారు. ఈ చిత్రం సూపర్‌హిట్ అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. నగరంలో ఆదివారం చిత్ర యూనిట్ సందడి చేసింది. నాంది హిట్ చిత్రం తర్వాత హీరో అల్లరి నరేష్ ..దర్శకుడు విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందించిన చిత్రమే ఉగ్రం. అల్లరి నరేష్‌కు జతగా మిర్నా మీనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ ఇది తనకు 60వ చిత్రమని, ఉగ్రంతో మీ ముందుకు వస్తున్నానన్నారు. నాంది సినిమాకు మించి ఈ చిత్రం ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా మిస్సింగ్ కేసుల నేపథ్యంలో ఎంతో ఆసక్తిగా సాగుతుందన్నారు. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో 1.5 లక్షల మంది కనిపించకుండా పోయారనే విషయం తెలిసిందేనని, వారంతా ఏమయ్యారో ఇప్పటికీ తెలియదంటూ రూపొం దించిందే ఉగ్రం చిత్రమని పేర్కొన్నారు. ఈ నెల 5న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు అల్లరి తెలిపారు. మిస్సింగ్ కేసులు పరిష్కరించే పోలీస్ పాత్రలో నటించానని, ఇప్పటి వరకు ఇటువంటి పాత్ర చేయలేదన్నారు. చిత్ర హీరోయిన్ మిర్నా మీనన్ మాట్లాడుతూ తెలుగులో ఇది తనకు రెండో చిత్రమన్నారు. అల్లరి నరేష్ చాలా అద్భుతంగా నటించారని చెప్పారు. ఈ చిత్రానికి శ్రీచరణ్ పాకాల సంగీతం అందించగా, కెమెరామన్‌గా సిద్ వ్యవహరించారన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసారు


కార్తీక్


గుణశేఖర్


హర్షవర్ధన్

రావికమతం : జెఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో రావికమతం, యర్రబంద గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఎర్రబంద గ్రామానికి చెందిన మచ్చ కార్తీక్ ఓబీసీ కేటగిరిలో 81వ ర్యాంక్ సాధించాడు. కార్తీక్ తల్లిదండ్రులు శ్రీను, నాగమణి రైతు కుటుంబానికి చెందినవారు. రావికమతానికి చెందిన ముమ్మిన గుణశేఖర్ ఓబీసీ కేటగిరీలో 246 ర్యాంక్ సాధించారు. గుణశేఖర్ తల్లిదండ్రులు చిన్నారావు, నూకరత్నం కూడా రైతు కుటుంబానికి చెందినవారే. కార్తీక్ గుణశేఖర్ ఇరువురూ విశాఖలోని శ్రీ విశ్వ కాలేజీలో చదువుతుండగా రావికమతానికి చందిన ఉగ్గిన హర్షవర్ధన్ ఓబీసీ కేటగిరీలో 2,463 ర్యాంక్ సాధించాడు. హర్షవర్ధన్ విశాఖలో నారాయణ కాలేజీలో చదువుతున్నాడు. తల్లిదండ్రులు శ్రీనివాస్, సుజాత కూడా రైతు కుటుంబానికి చెందిన వారే. వీరు ఉన్నత ర్యాంకులు సాధించడంపై కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందించారు.

తైక్వాండోలో ఆరుగురికి పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ చందు

ఎస్.రాయవరం : జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో అడ్డురోడ్డు విద్యార్థులు ఆరుగురు పతకాలు సాధించినట్టు కోచ్‌చందు తెలిపారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మధ్యప్రదేశ్ లో జరిగిన పోటీల్లో ఏడుగురు విద్యార్థులు పాల్గొనగా వారిలో ఆరుగురు పతకాలు పొందారని తెలిపారు. జి.సాయితేజ శ్వేతశ్రీ బంగారం, ఆర్.హాసిని, పి.ప్రసన్నలకు కాంస్య, ఎస్.వరలక్ష్మి, పి.చైతన్య ఆదిత్య చరణ్ తేజ, డి.రాజేష్‌లకు రజత పతకాలు సాధించారన్నారు. వీరిని కోచ్ చందు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అచ్యుత్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎం.అచ్చన్నాయుడు, సీనియస్ కోచ్ ఎస్.సత్యనారాయణ, కుటుంబ సభ్యులు అభినందించారు.

టెక్నికల్ టీచర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లిటౌన్ : ఆంధ్రప్రదేశ్ విజయవాడ ప్రభుత్వ డైరెక్టర్ పరీక్షల విభాగం టెక్నికల్ టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం పేర్కొన్నారు. (42 రోజుల శిక్షణ)కోర్స్ ప్రాక్టికల్స్ 2023 సంవత్సరంలో ప్రభుత్వం ప్రకటించిన జిల్లాల్లో పని చేసే ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం వెబ్‌సైట్ www.bre.ap.gov.in నందు ఈనెల 29 నుంచి మే 6వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆమె తెలిపారు. అభ్యర్థులు పై వెబ్‌సైట్‌లోగాని, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కాని దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

గంజాయి వ్యాపారులపై పోలీసుల దాడులు

రోలుగుంట: కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై బి.నాగకార్తీక్ తన సిబ్బందితో కలసి గంజాయి వ్యాపారాలు సాగిస్తున్న గ్రామాలపై శని, ఆదివారాలు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎం.కె.పట్నం సమీపంలో బుంగా రాజబాబు కళ్లాల వద్ద 26 గోనె సంచులతో నింపిన 540 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ నుంచి తరలించడానికి వాహనం కోసం సిద్ధంగా ఉంచిన ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని, వీరిని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్సై ఆదివారం సాయంత్రం తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.40 లక్షలు ఉంటుందన్నారు.

గంజాయి తరలిస్తున్న నలుగురు తమిళ యువకుల అరెస్టు

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్ షెల్టర్ వద్ద గంజాయి తరలిస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ ఉపేంద్ర వివరాల మేరకు.. బస్ షెల్టర్ వద్ద తమిళనాడుకు చెందిన శక్తివీర్, శంకర్, మహమ్మద్, శక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీలు చేశారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారి వద్ద బ్యాగ్‌లో 18 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. దీంతోపాటు ఐదు సెల్‌ఫోన్లు, రూ.1500 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

ఉత్తరాంధ్రకు మహర్దశ

- గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాకారం
- నవరత్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం
- అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోరుకునే ముఖ్యమంత్రి జగన్
- మీ ఆశీస్సులతో 2024లో మరోసారి విజయఢంకా మోగించడం ఖాయం
- చోడవరం, మాడుగులలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన వై.వి.సుబ్బారెడ్డి


గవరవరం వంతెనను ప్రారంభిస్తున్న ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి

సాక్షి, అనకాపల్లి : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ పరుగులు పెడుతున్నాయని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల చెంతకే పాలన తీసుకువచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని కొనియాడారు. అనకాపల్లి జిల్లాలోని చోడవరం, మాడుగుల నియోజవర్గంలో ఆదివారం పలు అభివృద్ధి పనులు శంకుస్థాపన, ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మాడుగుల నియోజకవర్గంలో కాశీపురం నుంచి గవరవరం వరకు రూ. 20 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.22లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. చోడవరం నియోజకర్గంలో రూ.12 కోట్లతో నిర్మించిన గవరవరం వంతెనను వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవరత్నాల పేరిట అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, విద్య, వైద్యం రంగాల్లో సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోరుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని.. .మీ ఆశీస్సులతో రానున్న 2024 ఎన్నికల్లో మరోసారి విజయఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీతో ఘన స్వాగతం

చోడవరం : గవరవరం వంతెన ప్రారంభోత్సవానికి వచ్చిన సుబ్బారెడ్డికి చోడవరంలో ధర్మశ్రీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పార్టీ కార్యాలయం నుంచి వందలాది మోటారు సైకిళ్లతో భారీ బైక్ ర్యాలీ చేశారు. ప్రత్యేక వాహనంపై సుబ్బారెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ గవరవరం వెళ్లగా ఆయన వెంట భారీ సంఖ్యలో ఆనందోత్సాహాల మధ్య బైక్ ర్యాలీ చేశారు. చోడవరం, అన్నవరం, రేవళ్లు, లక్కవరం మీదుగా గవరవరం వంతెన వరకూ ర్యాలీ జరిగింది.

ఈ సందర్భంగా మీడియాతో సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తుందన్నారు. చోడవరం, మాడుగుల నియోజవర్గాలను కలిపే గవరవరం వంతెన నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన చేస్తే గత టీడీపీ ప్రభుత్వం కనీసం శ్రద్ధ పెట్టి వంతెన నిర్మాణం పూర్తిచేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వానికి చెప్పడంతో పనులు పూర్తిచేయడం జరిగిందన్నారు. వెనుకబడిన ప్రాంతంగా ఉన్న ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాలో పోర్టుకు శంకుస్థాపన చేయడం జరిగిందని, దీనివల్ల ఆ ప్రాంతంలో వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. మే 3వ తేదీన విజయనగరం జిల్లా భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారన్నారు. విశాఖపట్నంలో వైజాగ్ టెక్ పార్కుపేరుతో అభివృద్ధి చేయబోయే అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తారన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, మండల అధ్యక్షులు దొడ్డి వెంకట్రావు, బూరె బాబూరావు, జెడ్పీటీసీలు కర్రి సత్యం, దొండా రాంబాబు పాల్గొన్నారు.


చోడవరం బైక్ ర్యాలీలో పార్టీ శ్రేణులు

బోయిలకింతాడలో మహానేత విగ్రహావిష్కరణ

దేవరాపల్లి : మండలంలోని బోయిలకింతాడలో వైవీ సుబ్బారెడ్డి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ సత్యవతితో కలిసి మహానేత డా. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు.పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ నాడు మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారని, నేడు అదే బాటలో ఆయన తనయుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక పాలన సాగిస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యానాయుడు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మాడుగుల నియోజకవర్గంను అభివృద్ధి, సంక్షేమంలో మోడల్‌గా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో 75 సచివాలయాలకు గాను 53 సచివాలయ భవన నిర్మాణాలను పూర్తి చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న గొప్ప మనసున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అనంతరం సకల సదుపాయాలతో సచివాలయాన్ని నిర్మించిన స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావును వైవీ సుబ్బారెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు ఈర్లె అనురాధ, నియోజకవర్గ పరిశీలకుడు ఉరుకూటి అప్పారావు, ఎంపీపీ రాజేశ్వరి జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, ఉగ్రాకుల గంగాభవానీ, ఎంపీటీసీ రుత్తల లక్ష్మీ, కర్రి సూరినాయుడు, డా. వి.సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ విజయనగరం లోకల్ మున్సిపల్ కార్పొరేషన్ వుడా స్థలంలో 2BHK HOUSE @ 25 lakhs 90% లోన్ కలదు. 93918 73337 [S-1201695]

LEASE / SALE

■ పౌడర్ కోటింగ్ ఫర్నిచర్ ఇండస్ట్రీ (మంచి రన్నింగ్ కండీషన్‌లో వున్న) లీజుకు గాని అమ్మకమునకు గాని కలదు. సెల్ : 9885564599 [G-79]

PLOT FOR SALE

■ అమ్మతాపురం - యలమంచిలి రోడ్ వెంకటపురం జంక్షన్ (అప్పారాయుడుపాలెం) 182 (N/W) 228 (S/E) కార్నర్ ఉడా బిట్స్ అమ్మకానికి కలదు. గజం : 8,000/-. ఫోన్: 96406 01538, 90926 88672 [V-776767]

■ 5 లక్షలకే 111 చ॥గ॥లు GVMC 77వ వార్డులో స్టీల్‌ప్లాంట్‌కి 7 కి.మీ.లో ప్లాట్స్ అమ్మకానికి కలదు. స్పాట్ రిజిస్ట్రేషన్, EMI కలదు. ఫోన్ : 73864 14017 [V-794456]

■ Bheemili Nidigattu Harbour City VUDA Layout Beside 1000 / 500 Syds N/F, 30 Ft. Rd., Face, Farm land, Guest House Purpose, Plot Sale. Ph : 87591 99999 [V-2750]

Services

BUSINESS OFFER

■ అద్భుత వ్యాపార అవకాశం! గ్యాస్ ప్రమాదాలను అరికట్టే సేఫ్టీ డివైస్ ప్రమోట్ చేస్తూ రో॥ 5000/- వరకు సంపాదించే అవకాశం, ఏరియా వైజ్ ఫ్రాంఛైజీలకై సంప్ర: 9100532959 [H-797452]

Wanted

■ జనతామార్ట్ : 399/-తో అద్భుత అవకాశం. ఆరోగ్యంతో పాటు ఆదాయం. 18 సం॥లు దాటిన వారందరికి అవకాశం. ఫోన్: 89196 12953, 92467 59659, 94914 56418 [V-1850]

■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటి వద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర॥ 7815811791 [G-785894]

■ Wanted Telecallers (Female) for Digital Media Company. Qlf : Any Degree / B.Tech, Age : 23 to 30 yrs, Exp. Min. One Yrs. Sal : 10K to 20 K + Incentives. Sheelanagar - 70322 38881 [V- 794511]

■ Wanted Experienced IIT Incharges, Computer Operators, Eduhunt IIT Academy, Akkayyapalem, VSP. Send UR Resume to Ph : 99636 72015 [V- 1860]

■ Wanted Lady Receptionist, to Work in an Educational Institution. Contact : 81069 20102 [V-1852]

■ SBI Life లో అడ్వైజర్ / సేల్స్ మేనేజర్‌గా చేయుటకు M/F కావలెను. Qlf : 10th - డిగ్రీ & Govt. & Pvt., Rtd., ఎంప్లాయిస్, బిజినెస్ పర్సన్స్, హౌస్ వైఫ్స్, Ex. సర్వీస్ మెన్స్ సంప్ర. PM : 30k - 50k. ఫోన్ : 90522 16662 [V-1856]

■ Urgent Required : Receptionist (F), Lab technicians (MLT), Sampath Medi Care, Sriharipuram, Coromandal Bus Stop. Cont : 90327 81973 [V- 794457]

■ Wanted Sales / Marketing Representative Salary : 10k + Ince. Age : 20 to 30 Yrs (M/F) Qlf : Good Communication, Location : Poorna Market. Ph : 99669 66099 [V-10502]

■ Training & 100% Job. Assistance on any Software Developer open New Batches. C, Fullstack JAVA, Python etc. Qlf : Any Graduation. Ph : 78931 11605 [V-2763]

■ ప్రకాశం జిల్లా, ఒంగోలులో నారాయణ రియల్ ఎస్టేట్ నందు మార్కెటింగ్ స్టాఫ్ M/F కావలెను. Q: 10th - MBA. జీతం + కమీషన్, భోజనం + ఫ్రీ రూమ్‌కలదు. ✆ 63046 42825, 77807 51944 [O-787138]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888 [H-793419]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం